

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం
- పొంగిపొర్లిన మురుగు కాలువలు



నీటిమయమైన శ్రీరామ్ నగర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో శనివారం సాయంత్రం ఐదు గంటల 55 నిమిషాలకు ప్రారంభమై ఉరుములు, మెరుపులు, గాలి తో కురిసిన వర్షం తో ఒక్కసారిగా రోడ్లపై తిరిగే జనం ఎక్కడికక్కడ నిలిచిపోయారు. రోడ్లపై తిరిగే వాహనాలు కూడా భయం భయంగా ప్రయాణం సాగించారు. వర్షపు నీరు డ్రెయిన్లు పట్టకుండా పారాయి. శివారు ప్రాంతాల్లో మట్టి రోడ్లు కొట్టుకుపోయాయి. ద్విచక్ర వాహనాలలో వెళ్లేవారు ఇంటికి చేరుకోలేని పరిస్థితి నెలకొంది. హంద్రీ బ్రిడ్జి కింద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం నీటితో కాల్వలలోని మురికి నీరు అంతా కొట్టుకుపోయింది.

లక్ష్మీ నగర్ , శ్రీరామ్ నగర్ పొంగిపొర్లిన కాల్వలు

కొద్దిపాటి వర్షానికే లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్‌లో కాల్వలు పొంగిపొర్లాయి. రోడ్డుపై నడవలేని పరిస్థితి. ఎమ్మెల్యేలు వచ్చిన ప్రతి ఒక్కరు శంకుస్థాపనలు చేయడం తప్ప శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు. అవార్డు నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో కాలువలు రోడ్లు ఆశాస్త్రీయంగా వేయడంతో భారీ వర్షం పడిన ప్రతిసారి కాలువలలో నీరు పోవడానికి వీలు లేక రోడ్లపై నిలుస్తుంది. దీనికి తోడు కరెంటు పోవడంతో ఇండ్ల నుండి మెట్ల మీదుగా దిగే సందర్భాల్లో చిన్నపిల్లలు కాలువలు కనిపించక కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వర్షపు నీరు రోడ్లనిండా నిండుకోవడంతో రోడ్డు ఎక్కడుంది. కాలువలు ఎక్కడ ఉన్నాయి అనేది అర్థం కాక కాలువలో పడి గాయాల పాలయ్యే పరిస్థితి ఉంది. శుద్ధవాగు ఆక్రమణలు తొలిగించి వర్షపు నీరు సాఫీగా వెళ్లిపోయే విధంగా నిర్మించాలని కోరారు.

రతనాల సీమగా మారుస్తాం

- కర్నూలులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి రూ.50 కోట్లు
- కర్నూలు పర్యటనలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం కర్నూలు నగరంలో ఆయన పర్యటించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఓర్వకల్ విమానా శ్రయానికి చేరుకున్న సిఎం అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సిక్యాంప్ రైతు బజారుకు చేరుకున్నారు. రైతుబజార్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ధనలక్ష్మి నగర్లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పార్కు శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు. తొలుత అందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. సిఎం మాట్లాడుతూ.... రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. నగరంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి రూ.50 కోట్లు నిధులు మంజూరు చేస్తామన్నారు. సి.క్యాంప్ రైతు బజార్ అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ఓర్వకల్లు డ్వాక్రా మహిళలకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే వినతి మేరకు కర్నూలు నుండి సఫా కాలేజి వరకూ రోడ్డు విస్తరణకు ఆదేశాలు ఇస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు చెత్త నుండి సంపద బాధ్యతలు అప్పగిస్తామని, మహిళకు ఆదాయం అందిస్తామని చెప్పారు. సత్యసాయి జిల్లా లేపాక్షి నుండి ఓర్వకల్లు వరకు పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేసి ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తయారవుతుందని, రాయలసీమ కేంద్రంగా పని చేస్తుందని చెప్పారు. పోలవరం నుండి బానకచర్లకు నీళ్లు తెస్తే రాయలసీమ గేమ్ చేంజర్‌గా తయారవుతుందని, ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే పరిస్థితి వస్తుందని తెలిపారు. సంక్షేమం, ఉపాధి, అభివృద్ధి శాశ్వతంగా గుర్తు పెట్టుకునేలా చేస్తామన్నారు.

పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి

అంతకు ముందు సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ స్థాపకులు సుధారాణి, ఆర్ధా గ్లోబల్ సిఇఒ కరణ్‌షా, ఐసిఎన్ఇసి డైరెక్టర్ సౌమ్య చతుర్వేదుల, గ్రీన్ కో ప్రతినిధి శ్రీనివాసరావుతో చంద్రబాబు ముఖాముఖిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మిద్దెతోటల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని ప్రజలను ఆయన కోరారు.



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జిల్లాలో పి 4 అమలుకు చర్యలు : కలెక్టర్

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల మందికి పైగా ఉద్యోగులు, ప్రజలు అందరూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలలో పాల్గొన్నారని, వారికి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై, పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. ఆర్థిక అసమానతలను రూపుమాపుతూ ముఖ్యమంత్రి తెచ్చిన పి4 కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. గ్రామాలలో ఇప్పటికే ఆర్థికంగా వెనకబడిన 20 శాతం మంది ప్రజలను గుర్తించామన్నారు. 55 మంది మార్గదర్శకులను కూడా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేశామన్నారు. ముఖ్యమంత్రి ఒక విజన్‌తో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, అందుకనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లా డుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో పాణ్యం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కర్నూలులో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన 16 వార్డులు ఉన్నాయని, అందులో తాగునీటి సమస్య ఉందని, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రిని కోరారు. ఎక్స్‌టెన్షన్ ఏరియాలో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయని, అందుకనుగుణంగా సిసి రోడ్లు, సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్‌లను మంజూరు చేయాలని కోరారు. అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్లను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కట్టలు తెగిపోవడం లాంటివి జరిగాయని, వాటికి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉర్దూ యూనివర్సిటీకి నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్వాడీ సెంటర్లు పెంచాలన్నారు.



సిక్యాంపు రైతు బజారులో దోసకాయ కొంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గుండ్రేవులను పూర్తి చేయాలి : ఎంపీ శబరి

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క క్షణం విశ్రాంతి లేకుండా ప్రజల కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేయాలని, గోరుకల్లు రిజర్వాయర్ పర్మనెంట్‌గా మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, శరీన్‌నగర్‌లో బ్రిడ్జి నిర్మించాలని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రులు బీసీ.జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండి.ఫరూక్, పి.నారాయణ, టిజి.భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు పి.రంజిత్ బాషా, జి.రాజకుమారి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, జయసూర్య, పార్థసారథి, కెఇ శ్యాం బాబు, ఎమ్మెల్సీ బిటి నాయుడు, కర్నూలు, నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.



ధనలక్ష్మి నగర్ స్వచ్ఛాంధ్ర పార్కుకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వేసవి తాపంపై అవగాహన స్కిట్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల , వైద్య కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీ (కెఎంసి) వైద్య విద్యార్థులు ఆసుపత్రి ఆవరణలోని న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ , వైద్య కళాశాలలో పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేసవి తాపం పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఇంటర్న్‌షిప్ విద్యార్థులు 'బీట్ ద హీట్' పేరుతో న్యూ డయాగ్నొస్టిక్ బ్లాక్ వద్ద చక్కటి స్కిట్ ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంట్లో లేదా గ్రామంలో చేయాల్సిన ప్రథమ చికిత్స, ఏ పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రికి తరలించాలనే విషయాలను విద్యార్థులు తమ స్కిట్ ద్వారా వివరించారు. కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వచ్ఛమైన ఆసుపత్రి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని అగ్రస్థానంలో నిలిపేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలు శుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్‌సింధియా శుభప్రద, సిఎస్ఆర్ఎంఒ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఒడి డాక్టర్ సుధా కుమారి, రేడియాలజీ హెచ్ఒడి డాక్టర్ రాధా రాణి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివ బాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, ఎస్‌పిఎం డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ఆసుపత్రి సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్స్ డాక్టర్ రవినాయక్, డాక్టర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

కెఎంసి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

'స్వచ్ఛ ఆంధ్ర... స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కాలేజీ (కెఎంసి) ఆధ్వర్యంలో శనివారం సిల్వర్ జూబ్లీ కాలేజీ వెనుక ఉన్న 'మన వృద్ధాశ్రమంలో' వృద్ధులకు ఆరోగ్య అవగాహ , వైద్య శిబిరం నిర్వహించారు. కెఎంసి వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలోని వృద్ధులు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలని, వయస్సుకు తగ్గట్టుగా ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి మనిషికి ఆత్మాభిమానం ఉంటుందని, ఎవరిపైనా ఆధారపడ కూడదనే భావనతో చాలా మంది వృద్ధాశ్రమాల్లో చేరుతున్నారని ఆయన అన్నారు. ఇంటర్న్‌షిప్ విద్యార్థులు వృద్ధులందరి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ, లెక్చరర్ ఇన్ సోషల్ సైన్సెస్ సురేష్ కుమార్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.




వేసవి తాపంపై అవగాహన కెఎంసి వైద్య విద్యార్థులు

రైతు బజార్ విస్తరణకు రూ.6 కోట్లు

- ప్రకటించిన సిఎం చంద్రబాబు : మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతు బజార్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.6 కోట్లు ప్రకటించారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. రైతు బజారులో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబుతో కలిసి మంత్రి టిజి.భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు బజార్ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి భరత్ తెలిపారు. దీనిపై స్పందించిన సిఎం వెంటనే మాట్లాడుతూ రూ.6 కోట్లతో రైతుబజార్ విస్తరణ చేపడతామని ప్రకటించారని మంత్రి చెప్పారు. పార్కింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని, సంవత్సరం లోపు రైతు బజార్ విస్తరణ పనులు పూర్తి చేయాలని అధికారులను సిఎం ఆదేశించారన్నారు. ఇక్కడే అన్న క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారన్నారు. రైతు బజార్ విస్తరణకు నిధులు కేటాయించిన సిఎం చంద్రబాబుకు.. మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్న సిఎం చంద్రబాబు నాయుడుకు .. మంత్రి టీజీ.భరత్ ఘనంగా స్వాగతం పలికారు.



ప్రమాదంలో ప్రాథమిక విద్య

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసే విధంగా రాష్ట్రంలో కూటమి సర్కార్ చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఉన్న ఆరు రకాల పాఠశాలల వ్యవస్థను తొమ్మిది రకాల పాఠశాలలుగా ఏర్పాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. ఈ చర్యల వల్ల గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు లేకుండా పోయే ప్రమాదం ఉంటుంది. ఫౌండేషన్ పాఠశాలలు, శాటిలైట్ పాఠశాలలు, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయనుంది. గ్రామంలో ఉన్న కొత్తగా ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ప్రధానో పాధ్యాయులుగా ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తుంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలలో ఉన్నటువంటి స్కూల్ అసిస్టెంట్లను అక్కడికి తరలించడం ద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఏర్పడే ప్రమాదం ఉంది. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో ఒకటి నుండి ఐదు వరకు మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఒకటి నుండి ఏడు వరకు తర గతులను నిర్వహించారు. ఒకే గ్రామంలో రెండు ప్రాథమిక పాఠశాలలో ఉండగా విద్యార్థులు బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో నుండి నేరుగా మోడల్ ప్రైమరీ పాఠశాలలకు చేరేందుకు అవకాశం ఉంటుంది. అదే గ్రామంలో ఉన్నత పాఠశాల ఉంటే అక్కడ కూడా ఒకటి నుండి పదవ తరగతి వరకు బోధన అందించడం జరుగుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా ఉన్నత పాఠశాలలో చేర్పించేందుకు మొగ్గుచూపుతారు. బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవకాశం ఉండదు. అందువల్ల ఈ పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమాంతర మీడియం బోధన లేకుండా కేవలం ఇంగ్లీష్ మీడియం బోధననే చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల తెలుగు మీడియంలో చేరేందుకు ఇష్టపడే విద్యార్థులు డ్రాపవుట్స్‌గా మధ్యలోనే విద్యను ఆపేసే ప్రమాదం ఉంది. అలాగే జిల్లాలో కన్నడ , ఉర్దూ మీడియం పాఠశాలల బోధన కూడా అందుతుంది. ఉర్దూ, కన్నడ మీడియాలను పూర్తిస్థాయిలో ఎత్తివేయడంతో విద్యార్థులు ఇక ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం చేయడానికి ముందుకు వచ్చే అవకాశం లేదు. ఇంటిగ్రేటెడ్ హైస్కూల్స్ పేరుతో 1నుండి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో ప్రత్యేకంగా బాలికలకు ఈ తరగతులు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే కెజిబివి మోడల్ స్కూల్ పాఠశాలలో విద్యార్థినిలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతితో విద్యా బోధన అందిస్తున్నారు. ఇప్పుడు ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ బోధన కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రతికూల ఫలితాలే వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయాన్ని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రజాభిప్రాయ సేకరణలో గూండాగిరి: రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి తండ్రి, మాజీ ఎంపీ, బిజెపి నేత టిజి.వెంకటేష్‌కు చెందిన టిజివి ఎస్ఆర్ఎఎసి ఆల్కాలీస్ పరిశ్రమ విస్తరణ కోసం కర్నూలు ఆర్‌డిఒ సందీప్ ఆధ్వర్యంలో బుధవారం పరిశ్రమ ఆవరణలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ వ్యవహారం మొత్తం ప్రయివేట్ గూండాల పర్యవేక్షణలో జరిగింది. అభిప్రాయాలను తెలిపేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులను బయటకు ఈడ్చుకెళ్లారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్రపై దాడికి పాల్పడ్డారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం పలు విమర్శలకు తావిస్తోంది. పలువురు ప్రజా సంఘాల నాయకులను బయటకు ఈడ్చుకెళ్లారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్రను విచక్షణ రహితంగా బూతులు తిడుతూ గొంతు మీద కాలేసి నొక్కుతూ దాడి చేశారు. మరి కొంత మంది నాయకులను అడ్డుకుంటుండగానే అలానే పైకెళ్లి అర్జీలు ఇచ్చి వచ్చారు. కానీ ఎలాంటి అభిప్రాయాన్ని చెప్పనివ్వలేదు. దౌర్జన్యాలను వీడియో తీసిన ఓ మీడియా ప్రతినిధిని బెదిరించి ఫోన్ లాక్కుని డిలీట్ చేయించారు. మీడియా ప్రతినిధులెవరూ కనీసం ఫొటోలు తీయడానికి కూడా అనుమతించలేదు. ఇంత జరుగుతున్నా అక్కడున్న వందల మంది పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు.

తగ్గని భానుడు : ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడి భగభగలు మొదలై ప్రస్తుతం ఎండ తీవ్రత పెరిగింది. అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నా వేడి ఏ మాత్రం తగ్గడం లేదు. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ప్రస్తుతం 42 డిగ్రీలకు చేరుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానూ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. శనివారం సాయంత్రం కురిసిన వర్షం కర్నూలు నగరానికి కొంత ఉపశమనం కలిగించింది.



కాంగ్రెస్ నాయకుల నిర్బంధం

-ప్రతిపక్షాల గొంతు నొక్కే ధోరణి మానుకోవాలి
-డిసిసి నంద్యాల అధ్యక్షులు లక్ష్మినరసింహ యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జంగిటి లక్ష్మి నరసింహ ఆధ్వర్యంలో ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు జిల్లా అధ్యక్షుడి నివాసాన్ని చుట్టుముట్టి గృహనిర్బంధం చేశారు. అనంతరం డిసిసి అధ్యక్షుడు జంగిటి లక్ష్మి నరసింహ యాదవ్, సిటీ అధ్యక్షుడు జిలాని బాషా, తేనె నాగరాజ్, ఇస్మాయిల్‌లను అరెస్టు చేసి ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.జంగిటి లక్ష్మి నరసింహ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ పార్టీని చూసి కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుందని, రాబోయే ఎన్నికల్లో జగన్ రెడ్డి ప్రభుత్వానికి పట్టినగతే చంద్రబాబు ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి, దుష్ట పాలనను తరిమికొట్టాలని, ప్రజాస్వామ్య విలువల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రతిపక్షాల గొంతు నొక్కే ధోరణిని మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఎన్నికల హామీలు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఆయా నియోజకవర్గాలు, మండలాల నాయకులు పాల్గొన్నారు.




కాంగ్రెస్ నాయకులను నిర్బంధించిన పోలీసులు

బ్రాహ్మణదొడ్డిలో గ్రామసభకు స్పందన

ప్రజాశక్తి-సి బెళగల్ : సిబెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డిలో కౌలు రైతుల గ్రామ సభకు శనివారం స్పందన లభించింది. విఆర్ఒ మజరా, విహెచ్ఎ చెంచు రాజులు కౌలు రైతులతో భూ హక్కు దారులతో సమీక్షించారు. కౌలు కార్డుల కోసం కౌలు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. భూ హక్కు దారులకు కౌలుకు ఇవ్వడం వలన ఎలాంటి నష్టాలు జరగవని అపోహలు వీడాలని పేర్కొన్నారు. రైతులు సుమారు 67 మంది పాల్గొనగా పంటల ఖరీఫ్ సాగులకు వేళయిందని అధికారుల సలహాలు పాటించాలని కోరారు.

సిఎం కలిసిన ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్

ప్రజాశక్తి- పత్తికొండ: కర్నూలుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ను పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం పై చర్చించినట్లు సమాచారం.



రక్తపోటు పై అవగాహన ప్రదర్శన

-బిపి తగ్గించుకుందాం: డాక్టర్ శైలేష్ కుమార్

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ప్రపంచ రక్త పోటు దినోత్సవం సందర్భంగా జిల్లా అసంక్రమిత వ్యాధుల కార్య నిర్వహణ అధికారి డాక్టర్ శైలేష్ కుమార్, కో లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ,కోడుమూరు వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రక్తపోటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలేష్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 10 లక్షల మరణాలు అధిక రక్త పోటే ప్రధాన కారణమవుతుందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ విషాదాన్ని నియంత్రించడం సాధ్యమతుందని, ఈ సంవత్సరం' మీ రక్తపోటును కచ్చితంగా కొలవండి, నియంత్రించండి– ఎక్కువ కాలం జీవించండి' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నామని జీవన శైలి మార్పులు , శారీరక శ్రమ, ఆహారపు అలవాట్లు ,జీవ క్రియలు సరిగా లేకపోవడం, పర్యావరణ సమస్యలు, ఊబాకాయం, పని భారం ఎక్కువ అయి ఒత్తిడి కారణంగా రక్తపోటు బాధితులు పెరుగుతున్నారన్నారు. ఈ అధిక రక్తపోటును నియంత్రించుకోవాలి అంటే కచ్చితంగా ప్రతి ఒక్కరూ ఉప్పు, కారం, నూనెలు, జంక్‌ఫుడ్ మాంసం వేపుళ్లకు దూరంగా ఉండాలని వీలైనంతవరకు ఆకుకూరలు కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని యోగా, ధ్యానం, నడక చేయవలెనని మద్యం ,సిగరెట్లు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ బిపి పరీక్ష చేయించుకోవాలని, ఊబకాయం ఉన్నవారు బరువు తగ్గించుకోవాలని తెలిపారు. కోడుమూరు తో పాటు కర్నూలు జిల్లా వ్యాప్తంగా అసంక్రమిత వ్యాధుల (NCD)సర్వే నిర్వహిస్తున్నామని వీటిలో అధిక రక్త పీడనం ఉన్న వారిని గుర్తించి సంచార వైద్య చికిత్సలో వైద్యం చేసి వారికి సరిపడా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ మల్లికార్జున, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, హెల్త్ సూపర్వైజర్ కె.కమాల్ సాహెబ్, ఉమాబాయి, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ ఆరోగ్య కార్యకర్తలు ,ఆశా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



కోడుమూరులో ప్రదర్శన

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రవాణా కార్యాలయాల ప్రైవేటీకరణను ఆపాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రవాణా శాఖ కార్యాలయాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటిసి) సెంటర్లను నిలిపివేయాలని, సెన్సార్ ఫిట్నెస్ ట్రాకులను వెంటనే రద్దు చేయాలని ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షులు దూదేకొండ కుమార్ అధ్యక్షతన కర్నూలు సూర్జిత్ భవన్‌లో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ రా మాంజ నేయులు, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.మహమూద్ మాట్లాడుతూ రవాణా రంగాన్ని కుదేలు చేసి కార్మికులను కార్పొరేట్ల కింద బానిసలుగా మార్చే కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలన్నారు. రవాణా కార్యాలయాల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, నిరుద్యోగులకు లక్షలాది మందికి స్వయం ఉపాధినిచ్చే రవాణా రంగాన్ని కాపాడుకోవాలని రానున్న రోజుల్లో జరిగే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. రవాణా రంగాన్ని ఓలా, ఉబర్ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూడటం దారుణమని విమర్శించారు. రోడ్డు భద్రత చట్టం పేరుతో కార్మికులకు జైలు శిక్షలు, లక్షల రూపాయల ఫైన్‌లు విధించే విధానాలను అనుమతించడమే కాకుండా, ఇప్పుడు ఆర్‌టిఎ కార్యాలయాలను ప్రైవేట్ వారికి అప్పగించడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా ఉందని అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోకపోతే ఆటో యూనియన్ సిఐటియు కార్మిక సంఘంగా ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఆటో యూనియన్ నగర నాయకులు త్యాగరాజు, రామకృష్ణ, బడేబాష, నాగరాజు, బి.చంద్ర శేఖర్ , పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.




బుట్టా శివ నీలకంఠ, విశ్వనాథ్, రమేష్ ఆధ్వర్యంలో జనరేటర్ ప్రారంభోత్సవం

కల్యాణ మండపానికి జనరేటర్ విరాళం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పద్మశాలి కల్యాణ మండపానికి బుట్టా ఫౌండేషన్ నుంచి రూ.4 లక్షల విలువైన జనరేటర్‌ను బుట్టా ఫౌండేషన్ అధినేత, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ విరాళంగా అందజేశారు. శనివారం స్థానికంగా ఉన్న పద్మశాలి కల్యాణ మండపంలో విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్‌ను బుట్టా శివ నీలకంఠ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు, వైసిపి వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు విశ్వనాథ్, రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బుట్టా శివ నీలకంఠ మాట్లాడారు. సమాజ హితం కోసం పని చేయడం మన బాధ్యత అని, ప్రజలకు ఉపయోగపడే స్థలాల అభివృద్ధికి బుట్టా ఫౌండేషన్ తరఫున విరాళాలు అందించడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. విశ్వనాథ్, రమేష్ మాట్లాడుతూ... పద్మశాలి సంఘం తరఫున బుట్టా ఫౌండేషన్ అధినేతలు బుట్టా శివ నీలకంఠ, బుట్టా రేణుక దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు డి.నజీర్ అహ్మద్, వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె.రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, మహబూబ్ బేగ్, వెంకటాపురం రాజు, పద్మశాలి సంఘం ట్రెజరర్ ఉరుకుందు, బౌద్ధ సంఘం అధ్యక్షులు సి.పి.రంగస్వామి, ఉపాధ్యక్షులు శ్రీరాములు, ఈరన్న పాల్గొన్నారు.

రక్తపోటు పట్ల జాగ్రత్త అవసరం

- రాష్ట్రీయ బాల స్వస్థ్య జిల్లా అధికారి డాక్టర్ కైలాష్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కైలాష్

ప్రజాశక్తి- దేవనకొండ

రక్తపోటు పట్ల జాగ్రత్త వహించాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య జిల్లా అధికారి డాక్టర్ కైలాష్ తెలిపారు. ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపోటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తపోటుపై అవగాహన లేక, సరైన సమయంలో వ్యాధిని గుర్తించకపోవడంతో ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. రక్తపోటు ఉన్న వారికి కొంత మందిలో బయటికి లక్షణాలేమీ కనబడవని చెప్పారు. చిన్న, చిన్న విషయాలకే ఎక్కువగా ఆందోళనకు గురవుతుండడం, ఎదుటి వారిపై అరవడం, ఉద్వేగానికి లోనవడం, తలనొప్పి, కంటి చూపు మందగించడం, ముక్కులో రక్తస్రావం, ఛాతిలో బరువు, నొప్పి, మాటలు తడబడడం, చెమట పట్టడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. సాధారణంగా అధిక రక్తపోటు మాత్రమే ఎటువంటి లక్షణాలను కలిగించదని, ఒక రోజు అకస్మాత్తుగా బయటపడి ప్రమాదం కలుగజేస్తాయని చెప్పారు. క్రమబద్ధమైన నడక, చక్కని వ్యాయామం చేయాలని, తినే ఉప్పు, కారం తగ్గించాలని సూచించారు. మాంసాహారం తక్కువగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా బిపి పరీక్ష చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. స్థానిక వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, కల్యాణ్, సామాజిక ఆరోగ్య అధికారి భాగ్యలక్ష్మి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, మల్లికార్జున, ఆరోగ్య విస్తరణాధికారి రంగస్వామి, పర్యవేక్షకులు శ్రీధర్, మద్దిలేటి, హనుమంతమ్మ పాల్గొన్నారు.

పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపిడిఒ విజయ శేఖర్ రావు, సర్పంచి పాల్ దినకరన్ ప్రారంభించారు. శనివారం వారు మాట్లాడారు. చలివేంద్రాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రకాశం, ఉప సర్పంచి తిక్కయ్య పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం మురుగు కాలువలలో వేయకుండా డస్ట్ బిన్లను ఉపయోగించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. శనివారం ఆదోని మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడ నుంచి భీమాస్ కూడలి ప్రధాన రోడ్డు మీదుగా నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం నిషేధమన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన ప్లాస్టిక్ బ్యాగులు, కవర్లను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి జరిమానా విధించామని తెలిపారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు, మజ్జిగ ఎక్కువగా తాగాలన్నారు. ఆదోనిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిఇ చలపతి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సందీప్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, నాగరాజ్, మేస్త్రీలు నరసింహులు, మహబూబ్ బాషా, వార్డు శానిటేషన్ సెక్రటరీ వెంకప్ప, మెప్మా సిఒ నారాయణమ్మ, నాగలక్ష్మి ఉన్నారు.


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మొక్కల పెంపకంతో వేసవి తాపాన్ని తగ్గించగలం

ఎమ్మిగనూరు : మొక్కలను పెంచడం ద్వారా వేసవి తాపాన్ని తగ్గించవచ్చని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'బీట్ ద హీట్' కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ర్యాలీలు చేపట్టారు. డిఇలు నీరజ, రాజు నాయక్, ఎఇలు మదన్ కుమార్, శరత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సత్యం హాజరయ్యారు. అలాగే పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని, చలువ పందిర్లు ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు. అనంతరం సోమప్ప సర్కిల్ అన్న క్యాంటీన్‌లో అల్పాహార పంపిణీని కమిషనర్ ఎస్.గంగిరెడ్డి తనిఖీ చేశారు. అలాగే కర్నూలు బైపాస్ రోడ్డులో డ్రైనేజీ పూడికతీత పనులు పరిశీలించారు.

మంత్రాలయం : ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపిడిఒ సూర్యనారాయణ ప్రజలకు సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటి చుట్టుపక్కల నీరు నిలవకుండా చూసుకోవాలని తెలిపారు. నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడతామని చెప్పారు. పరిశుభ్రతతో ఉంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం ఎండ తీవ్రతను తట్టుకోవడానికి సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి తాగునీటిని, మజ్జిగను పంపిణీ చేశారు. తహశీల్దార్ ఎస్.రవి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడు, ఇన్‌ఛార్జి కార్యదర్శి ఇబ్రత్ బాషా, విఆర్ఒ భీమనగౌడ పాల్గొన్నారు.

గోనెగండ్ల : స్వర్ణాంధ్ర-స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా గోనెగండ్లలో అధికారులు 'బీట్ ద హీట్' నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కఠినమైన వేడిమి కారణంగా వేసవిని ఎలా అధిగమించాలన్న విషయాలపై ప్రజలకు వివరించారు. ఎండ వేడి, వడదెబ్బ వల్ల డిహైడ్రేషన్ గురి కాకుండా సమయానికి తగినంత తాగునీటిని, మజ్జిగను తీసుకోవాలని సూచనలు చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద చలివేంద్రంలో ప్రజలకు మజ్జిగను ఎంపిడిఒ మణి మంజరి పంపిణీ చేశారు. ఇఒఆర్‌డి అనంతశయన, పంచాయతీ కార్యదర్శి సతీష్, టిడిపి నాయకులు బేతాళబడేసా, తిరుపతయ్య నాయుడు, పూజారి చంద్రశేఖర్, గౌండా రహిమతుల్లా పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి


మంత్రాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


గోనెగండ్లలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ మణి మంజరి

శ్రీవీరభద్రస్వామి ఆలయంలో చోరీ

- వెండి కిరీటం అపహరణ
- దేవాలయాల్లో వరుస దోపిడీలతో కలకలం

ప్రజాశక్తి - నందవరం



నందవరం గ్రామం కోట వీధిలో శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు సంపత్ గౌడ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం దేవాలయంలో చోరీ జరిగినట్లు చెప్పారు. స్వామివారికి ఆభరణాలు, కిరీటం 1 కిలో 75 తులాలు చేయించినట్లు తెలిపారు. దొంగలించిన కిరీటం 70 తులాలు ఉంటుందని చెప్పారు. స్వామి వారిపై ఉన్న ఆభరణాలను కూడా దొంగలించే ప్రయత్నం చేశారని, అది సాధ్యపడకపోవడంతో అలాగే వదిలేశారని తెలిపారు. గర్భగుడి తాళాలు రోజూ దేవాలయంలో ఒకచోట భద్రపరచే వారమని, గమనించిన వ్యక్తులు కిరీటాన్ని దొంగలించి తాళాన్ని అదే స్థానంలో ఉంచి వెళ్లారని చెప్పారు. దేవాలయ పూజారి యథావిధిగా 3 గంటల సమయంలో స్వామి వారికి పూజలు నిర్వహిస్తుండగా స్వామి వారి కిరీటం దొంగలించబడిందన్న విషయాన్ని తమకు తెలిపారన్నారు. తాము పరిశీలించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వరుస దోపిడీలతో కలకలం

మండలంలో దేవాలయాల్లో వరుస దోపిడీలు కలకలం లేపుతున్నాయి. గురువారం మండలంలోని కొట్టాల శ్రీరాముని దేవాలయంలో 4 కిలోల నాలుగు వెండి కిరీటాలు, శుక్రవారం వీరభద్రస్వామి దేవాలయంలో 70 తులాల కిరీటం చోరీ జరగడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. పోలీసులు దర్యాప్తు చేపట్టి దేవాలయ దోపిడీలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

అవ్వ జాతర సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ 93వ వెండి రథోత్సవం సందర్భంగా 19న (సోమవారం) ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు అల్కురి మఠం సిద్ధయ్య స్వామి, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు అల్కురి మఠం మహర్షి విజయ్ కుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. అవ్వ జాతర సందర్భంగా మూడేళ్లుగా అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక సంతపేటలో భారతి నిలయం పాఠశాల ఆవరణంలో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు పూజలు నిర్వహించి, అనంతరం అన్నదానం ప్రారంభిస్తామని చెప్పారు. భక్తులు, సేవకులు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న మహర్షి విజయ్ కుమార్

ఎస్‌జిటిలకు, లాంగ్వేజ్ పండిట్లకు

న్యాయం చేయాలి

- పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్‌జిటిలకు, లాంగ్వేజ్ పండిట్లకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు ప్రతాప్ రెడ్డి, భాస్కర్ ఆచారి కోరారు. ఆదోనిలో నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో సమాఖ్య ఆదోని ఆర్థిక కార్యదర్శి కోటన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదోన్నతుల్లో మోడల్, ప్రైమరీ స్కూల్‌కు కేటాయించిన ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టును పాత విధానంలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పరిగణించి, సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. అర్హతలుండి ఇప్పటికీ గ్రేడ్-2 లాంగ్వేజ్ పండితులుగా, వ్యాయామ ఉపాధ్యాయులు (పిఇటి)గా కొనసాగుతున్న వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాంతరంగా తెలుగు మీడియం, మైనర్ మీడియాలను కొనసాగిస్తూ, స్టాఫ్ ప్యాట్రన్ ప్రకారం ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతోకాలంగా మున్సిపల్ ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. స్థానిక అధికారులు స్పష్టంగా, నిబంధనల ప్రకారం ఖాళీలను గుర్తించి మున్సిపల్ ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. నాయకులు సురేష్ కుమార్, జంగం బసవరాజు, బడుగు బసవరాజు, దస్తగిరి, చంద్రమౌళి, మద్దయ్య, ఆనంద్, చంద్రశేఖర్ ఉన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

ప్రతిజ్ఞకే పరిమితమా..!

- ఆచరణలో నిర్లక్ష్యమా..?
- ప్రతిజ్ఞ చేసిన చోటే మురుగు కుంట

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, గ్రామస్తులు గ్రామంలో పరిశుభ్రత కోసం, మంచి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం కోసం, చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి, తడి, చెత్త పొడి, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరు డస్ట్ బిన్ల ద్వారా చెత్త బండికి అందించాలని ప్రజలకు తెలియజేస్తున్నారు.

మండలంలోని ఎరిగేరి గ్రామంలో బదినేహాళ్ క్రాస్‌లో శనివారం ఎంపిడిఒ విజయ శేఖర్ రావు, ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజలతో ప్రతిజ్ఞ కూడా చేయించారు. కార్యక్రమం ప్రతిజ్ఞకే పరిమితమా, ఆచరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రతిజ్ఞ చేసిన ప్రాంతంలోనే దుర్గంధం వెదజల్లే మురుగుకుంట అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నో రోజులుగా నీరు నిల్వ ఉండి, డ్రెయినేజీ పూడిపోయి రోడ్డుపైనే మురుగునీరు పారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మురుగుకుంట పక్కనే బస్సు షెల్టర్, ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రం, నీటి కుళాయి ఉండడం గమనార్హం. నిత్యం ఈ కూడలిలో ప్రజలు ముక్కు, నోరు మూసుకుని రాక పోకలు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారులు ప్రతిజ్ఞలు చేయించి చేతులు దులుపుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించాలని కోరుతున్నారు.


ప్రతిజ్ఞ చేసిన చోటే ఉన్న మురుగు కుంట


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గొల్ల రాఘవేంద్రకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలం నగరడోనా గ్రామానికి చెందిన హోసూరు గొల్ల సంజప్ప కుమారుడు హోసూరు గొల్ల రాఘవేంద్ర శనివారం జెఎన్‌టియు అనంతపురంలో జరిగిన 14వ కాన్వకేషన్ సందర్భంగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడారు. మధుమేహం, మధుమేహం వల్ల వచ్చే సమస్యలపై పరిశోధన చేసినందుకు యూనివర్సిటీ వారు మెచ్చుకొని డాక్టరేట్ అందించినట్లు తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ సుదర్శన్ రావు చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు చెప్పారు. గర్వంగా ఉందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలు చేస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు రాఘవేంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.



విసి సుదర్శన్ రావు చేతులమీదుగా డాక్టరేట్ అందుకుంటున్న రాఘవేంద్ర

19న మహా యోగి లక్ష్మమ్మ జాతర, రథోత్సవం

- ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలో ఈనెల 19న శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ జాతర, రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. శనివారం ఆలయ ధర్మకర్త రాయచోటి రామయ్య, తనయుడు రాయచోటి సుబ్బయ్య మాట్లాడారు. శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ జాతర, రథోత్సవం తిలకించడానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీటి వసతి, క్యూ లైన్లు, మధ్యాహ్నం 1 గంటకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈనెల 19న జాతర, వెండి రథోత్సవం సందర్భంగా పురవీధుల్లో అవ్వ విగ్రహాన్ని రథోత్సవంపై ఉంచి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ జీవిత చరిత్ర

శ్రీమహాయోగి లక్ష్మమ్మ ఆదోని నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న మూసానిపల్లి అనే చిన్న గ్రామంలో దళిత కుటుంబంలో జన్మించింది. తల్లిదండ్రులు మంగమ్మ, బండెప్పలు శ్రీమాహాయోగి లక్ష్మమ్మ అవ్వ అవధూత కావడంతో ఆమె తిరుగుతూ, పూర్తిగా నగ్నంగా, అర్థరహితంగా మాట్లాడేది. ప్రజలు ఆమె ఆధ్యాత్మిక ఉన్నత స్థితిని అర్థం చేసుకోలేకపోయారు. ఆమె పిచ్చిదని భావించారు. వివాహం ఆమె పిచ్చిని నయం చేస్తుందని నమ్మి, ఆమె తల్లిదండ్రులు మారెప్ప అనే యువకునితో వివాహం చేశారు. ఆమె తన నిజమైన ఆధ్యాత్మిక స్థితిని భర్తకు చూపించి, అదే రాత్రి తన సాధారణ స్థితిలో తండ్రి ఇంటికి తిరిగి వచ్చింది. ఈ క్రమంలో ఆదోనిలో జరిగే వారపు సంతకు హాజరయ్యేందుకు వస్తున్న కొంతమందితో కలిసి ఆమె ఆదోనికి చేరుకుంది. చెత్త కుప్ప పక్కన ఆమె స్థిరపడింది. ఆమె చేతికి దొరికినవన్నీ తింటూ నగ్నంగా తిరుగుతూనే ఉండేది. చెత్త కుప్ప పక్కన నివసించడం వల్ల, ఆమెను తొట్టి లక్ష్మమ్మ, ఆమె పిచ్చి ప్రవర్తన కారణంగా తిక్క లక్ష్మమ్మ అని పిలిచేవారు. ఒకసారి ఆదోనిలో చాలా రోజుల పాటు భయంకరమైన వర్షాలు కురిశాయి. కాలువలు పొంగిపొర్లాయి. వరదల్లో లక్ష్మమ్మ చనిపోయి ఉంటుందని ప్రజలు నిర్ధారణకు వచ్చారు. ఆమె పొంగిపొర్లుతున్న కాలువ నుంచి సురక్షితంగా బయటపడి అందరినీ ఆశ్చర్యపరిచింది. అవ్వను గుర్తించిన దివంగత రాచోటి వీరన్న, తుంబలంగుట్టి లక్ష్మయ్య, బల్లెకల్ నరసప్ప, మన్నె రాంసింగ్ వంటి కొంతమంది ఆమెను ఆరాధించారు. రాయచూటి రామయ్య, టిజి.లక్ష్మయ్య శ్రేష్టి, అరికెరి శివన్న, బల్లెకల్లు నరసప్ప, చాకలి పాపన్న, రాయచూటి సుబ్బయ్య, బల్లెకల్లు ఈరన్నలు అవ్వ సమాధి చెందక ముందే అవ్వ బండి ఉత్సవం నిర్వహించారు.

అవ్వ సమాధి

అవ్వ జీవ సమాధిలోకి 1933 మే 16న ప్రవేశించింది. అప్పటి నుంచి ఆ రోజును పండగ దినంగా పాటిస్తున్నారు. ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు బండ్ల పండగను నిర్వహిస్తారు. భక్తుల నుంచి ప్రేమ పూర్వక కానుకలతో వెండి రథాన్ని ప్రారంభించడం, ఆలయానికి వెండి రేకుతో కప్పబడిన పూత, విగ్రహానికి బంగారు పూత, అనేక విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలు వంటి అనేక పరిణామాలు ఇటీవలి కాలంలో జరిగాయి. వెండి బండి (రజత రథం) గత 13 సంవత్సరాలుగా బండ్ల ఊరేగింపు కోసం ఉపయోగించబడుతోంది. ఈ ఆలయం దూర ప్రాంతాల నుంచి భక్తులను ఆకర్షిస్తోంది. భక్తులను స్వాగతిస్తూ (ఆలూరు-ఆదోని రోడ్డులో) ఒక భారీ గ్రానైట్ తోరణం జూన్ 8, 2017న ప్రారంభించారు. ఆదోని చుట్టుపక్కల మూసానిపల్లి, అవ్వ జన్మస్థలంతో పాటు పలు ప్రాంతాల్లో అవ్వకు ఆలయాలు నిర్మించారు.

అవ్వ సమాధి చెందక ముందే 1932లో మొదటిసారిగా రథంలో ఊరేగింపుగా బయటకు తీసుకెళ్లారు. శ్రీరాయచూటి వీరన్న రథోత్సవాన్ని ప్రారంభించారు. పూర్వపు రోజుల్లో అవ్వ జాతర సమయంలో బండ్ల పండగకు చెక్క రథాన్ని ఉపయోగించేవారు. 1996లో వెండి రథంపై ప్రారంభించారు. రథం వెండి పూత కోసం 390 కిలోల వెండిని సమర్పించారు. వెండి రథోత్సవం మే 18, 1998 నుంచి ప్రారంభమైంది. వార్షిక జాతర సమయంలో లక్ష్మమ్మ అవ్వ ఉత్సవ మూర్తిని ప్రతేడాది ఆదోని ప్రధాన వీధుల చుట్టూ వెండి రథంలో తీసుకెళ్తారు. 1950ల చివరలో పట్టణంలో తీవ్రమైన కరువు, నీటి కొరత ఏర్పడింది. రాయచూటి సుబ్బయ్య సూచనల మేరకు ఒక బావి తవ్వారు. ఇది నీటితో నిండి ఉంది. ఈ నీటిని పట్టణ ప్రజలకు సేవ చేయడానికి పంపు చేశారు. ఈ బావి నేటికీ నీటితో నిండి ఉంది. భూగర్భంలో ఉన్న అవ్వ సమాధిని భక్తులు సందర్శిస్తారు. పూర్వకాలంలో ప్రవేశానికి, నిష్క్రమణకు ఒకే మార్గం ఉండేది. శుక్రవారం, అవ్వ జాతర వంటి ప్రత్యేక రోజుల్లో భక్తులు ఎక్కువ సంఖ్యలో అవ్వ సమాధిని సందర్శిస్తారు. దీని వల్ల దర్శనంలో ఆలస్యం జరిగింది. దీనికి పరిష్కారంగా రాయచూటి రామయ్య ప్రవేశానికి ఒకటి, నిష్క్రమణకు మరో మార్గం నిర్మించారు.



అవ్వ బ్యాంకు

1984లో రాయచూటి రామయ్య శ్రీమహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకు పేరుతో బ్యాంకింగ్ సేవలు ప్రారంభించారు. బ్యాంకు దినదినాభివృద్ధి చెంది పట్టణంలోని ఇతర బ్యాంకుల్లో నెంబర్ వన్‌గా నిలిచింది. ఇది ప్రజలకు అవసరమైన అన్ని బ్యాంకింగ్ సేవలను అందిస్తోంది. బ్యాంకు మంచి లాభాలను ఆర్జించింది. సొంత భవనాన్ని పొందింది. వృత్తి, విద్యా, ఆధ్యాత్మిక అవసరాలను తీర్చడానికి భగవాన్ శ్రీమహాయోగి లక్ష్మమ్మ విద్యా, ఛారిటబుల్ ట్రస్ట్ అనే ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పడింది. మార్కెట్ యార్డ్‌లో మరో శాఖను కూడా నవంబర్ 30, 2009న ప్రారంభించారు.

ఎమ్మిగనూరులో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' విజయాన్ని అభినందిస్తూ, దేశ సైనికులకు సంఘీభావంగా ఎమ్మిగనూరులోని ప్రధాన రోడ్డులో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పాల్గొని మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి ప్రతీకారంగా సైనికులు, బలగాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ మన దేశ సత్తాను ప్రపంచానికి చాటి చెప్పాయని తెలిపారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

జనసైనికుల కుటుంబ భద్రతే లక్ష్యం

- జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

జనసైనికుల కుటుంబ భద్రతే లక్ష్యంగా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేపట్టారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.లక్ష్మన్న తెలిపారు. శనివారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నుంచి ముఖ్య అతిథిగా వచ్చిన పార్టీ నాయకులు సాయి ఆధ్వర్యంలో పార్టీ సభ్యులకు ఐడి కార్డుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సభ్యత్వం పొందిన జనసేన నాయకులు, కార్యకర్తల కుటుంబ భద్రత కోసం సభ్యత్వం ఉన్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం ఉన్న వారికి ఏదైనా ప్రమాదం జరిగినా రూ.50 వేల వరకు ఆస్పత్రి ఖర్చులు చెల్లిస్తారని చెప్పారు. ఒకవేళ ప్రమాదంలో మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందిస్తారని పేర్కొన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను, జనసేన పార్టీ కార్యకర్తలకు సాయి వివరించారు. జనసైనికులు సి.వీరారెడ్డి, బజారి, ఎస్.చిన్న, సుమిత్ర, బీవీ.రవిచంద్ర, అలీ బాష, ఏసన్న, ప్రభుదాస్, నరసింహులు, చెన్నారెడ్డి, అబ్దుల్ రాంప్రసాద్, తిక్కయ్య, రామాంజనేయులు, గణేష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని మండల కార్యాలయ ఆవరణలో జనసేన పార్టీ తాలూకా నాయకులు బీసీ.నాగరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కిట్ల పంపిణీ చేపట్టారు. జనసేన తాలూకా క్రియాశీలక నాయకులు పవన్ కుమార్, కార్యకర్తలు రాజశేఖర్, నరసింహులు పాల్గొన్నారు.


మంత్రాలయంలో కిట్లను అందజేస్తున్న నాయకులు

దీప్తి ప్రియ యాదవ్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన డాక్టర్ చిలుక బజారి కుమార్తె దీప్తి ప్రియ యాదవ్ ఇంటర్ సిబిఎస్ఇ ఫలితాల్లో పాఠశాలలో ప్రథమ స్థానం సాధించారు. బనవాసిలోని జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దీప్తి ప్రియ యాదవ్ 462/500 మార్కులు సాధించి 93.33 శాతం పొందారు. శనివారం మొలగవల్లి గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు, టిడిపి నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రాంనాథ్ యాదవ్, రాము యాదవ్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్, మాజీ ఎంపిటిసి గోపాల్, జలందర్, ఐకాంత్, నాగరాజు, గోపాల్, అంజి, అంబన్నలు దీప్తి ప్రియను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. వారు మాట్లాడుతూ... గ్రామానికి చెందిన దీప్తి ప్రియ యాదవ్ జవహర్ నవోదయ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. దీప్తి ప్రియ ఉన్నత చదువులకు తమ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు.


దీప్తి ప్రియను అభినందిస్తున్న యాదవ సంఘం నాయకులు

తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలి

- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి

ప్రజాశక్తి - ఆదోని

భారత సైనికులకు అండగా నిలుద్దామంటూ ఆదోనిలో ఆదివారం నిర్వహించే భారీ తీరంగా ర్యాలీని జయప్రదం చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు, పట్టణ ప్రజలతో కలిసి ఆదివారం ఉదయం 10 గంటలకు తిరంగా ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆదోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి శ్రీనివాస్ భవన్ మీదుగా, అలాగే ఏరియా హాస్పిటల్, భీమా సర్కిల్ వరకు ర్యాలీ సాగుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ భారీ పాల్గొనాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ ఫయాజ్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రేణు వర్మ, బిజెపి నాయకులు నాగరాజు గౌడ్, సిపిఐ నాయకులు సుదర్శన్, కల్లుబావి రాజు, ఎంఐఎం నాయకులు నాసిర్, నాయకులు వాల్మీకి వెంకటేష్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, జనసేన పులి రాజు, తాహెర్ వలీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు